
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 22 సెప్టెంబరు 2024

కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు భంగం

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం ద్వారా కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు భంగం కలిగిందని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు, ధార్మిక మండలి మాజీ సభ్యుడు రాధాకృష్ణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీకి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1997లోనే శ్రీవారి ప్రసాదానికి నందిని నెయ్యి ఉపయోగించాలన్న నిర్ణయం జరిగిందన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరుతున్నట్లు తెలిపారు.



మానెయ్యిండీ..!

- రాష్ట్రంలోనూ తిరుమల 'లడ్డూ'ఎఫెక్ట్
- ఆలయాల్లో ఇతర ఉత్పత్తుల నెయ్యికి బ్రేక్
- తప్పనిసరిగా నందిని బ్రాండ్‌నే వాడాలి...
- పాలకమండళ్లకు దేవదాయశాఖ ఆదేశాలు

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పవిత్ర తిరుమల వెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర దేవదాయశాఖకు అనుబంధంగా ఉండే ఆలయాల్లో ప్రసాదం తయారీతోపాటు భక్తులకు అందించే అన్నదానంలో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉత్పత్తి అయ్యే నందిని నెయ్యి వాడకం తప్పనిసరి చేస్తూ దేవదాయశాఖ పాలకమండళ్లకు సూచించింది. శుక్రవారం రాత్రి ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఏ, బీ, సీ కేటగిరీలలో 34వేలకుపైగా ఆలయాలు ఉన్నాయి. కొన్ని ప్రతిష్ఠాత్మకమైన ఆలయాల్లో భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందజేస్తారు. వీటితోపాటు ప్రతిభక్తుడికి ప్రసాదంగా లడ్డూతోపాటు ఇతర పదార్థాలు అందిస్తారు. ఇకపై ఆలయాల్లో నందిని నెయ్యినే వాడాలని, ఇతర ఎటువంటి నెయ్యిని వినియోగించేందుకు వీలు లేదని ఆదేశించారు. తిరుమల భక్తులకు అందించిన లడ్డూలో చేపనూనెతోపాటు పశువుల కొవ్వును వినియోగించారన్న ఆరోపణలు తారస్థాయికి చేరడంతో దేవదాయశాఖ అప్రమత్తం అయ్యింది.

లడ్డూ ప్రసాదం అందించే ఆలయాలు ఇవే...

రాష్ట్రంలోని పలు ప్రసిద్ధ ఆలయాల్లో లడ్డూను ప్రసాదంగా అందిస్తారు. మైసూరులోని చాముండేశ్వరి ఆలయంలో లడ్డూ ప్రసాదం విక్రయిస్తారు. ఇక్కడ భక్తులకు భోజన సదుపాయం ఉంది. కుక్కె సుబ్రమణ్య, ఘాటి సుబ్రమణ్య, కొల్లూరు మూకాంబిక, యడియూరు సిద్ధలింగేశ్వర, నంజనగూడు శ్రీకంఠేశ్వర, బెంగళూరులోని బనశంకరి ఆలయం, కటీల్ దుర్గాపరమేశ్వరి ఆలయం, సవదత్తి రేణుకా ఎల్లమ్మ ఆలయాలతోపాటు పలు చోట్ల నిత్యాన్నదానం కొనసాగుతోంది. దాదాపు అన్ని ప్రముఖ ఆలయాల్లో ప్రసాద రూపంలో లడ్డూ విక్రయిస్తారు.



ధర్మస్థళ ఆలయం

అభిషేకాలకూ నందిని నెయ్యి



తీర్థప్రసాదాలు, అన్నదానంతోపాటు అభిషేకాల వేళ దీపాలు, అభిషేకాలకు నందిని నెయ్యినే వాడాలని సూచించారు. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం, రాత్రి దీపాలంకరణ, అభిషేకాలు కొనసాగిస్తారు. ఇలా ప్రతిసారి నందిని నెయ్యి మినహా ఇతరవాటిని వాడరాదని ఆదేశించారు. రాష్ట్రంలో ఏ గ్రేడ్ 205, బీ గ్రేడ్ 193, సీ గ్రేడ్ 33,500కు పైగా ఆలయాలు ఉన్నాయి.

మైసూరు వీధుల్లోకి దసరా ఏనుగులు



ప్యాలెస్ గేటు నుంచి బయటకు వస్తున్న ఏనుగులు

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొననున్న రెండు ఏనుగులు వీధుల్లోకి రావడం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ప్యాలెస్‌ను దాటి వీధుల్లో హల్‌చల్ చేశాయి. వీటిని కంజన్, ధనంజయ్ ఏనుగులుగా గుర్తించారు. ప్యాలెస్ గేట్‌ను తోసుకుని రోడ్డులోకి వచ్చాయి. తొలుత కంజన్ ప్యాలెస్ నుంచి బయటకు రాగా కాసేపటికే ధనంజయ్ కూడా వచ్చింది. జయమార్తాండ ద్వారం గుండా బయటకు వచ్చినట్లు గుర్తించారు. స్థానికులు హడలెత్తి పరుగులు తీశారు. మావటీలు అక్కడికి చేరుకుని ఏనుగులను తిరిగి ప్యాలెస్‌లోకి తరలించారు. జనసంచారం లేకపోవడంతో ముప్పు తప్పినట్లయ్యింది. కోడిసోమేశ్వర ఆలయం వద్ద ఏనుగులను అదుపులోకి తీసుకున్నారు.





- 140మంది శాసన సభ్యుల ససేమిరా

ఆస్తులు.. వెల్లడించం..!

- డీసీఎం సహా 8మంది మంత్రులు.. ● ఆర్‌టీఐ ద్వారా బహిర్గతం

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అందరికీ ఆదర్శంగా మసులుకోవాల్సిన నాయకులు అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నారు. నీతిగా, నిజాయితీగా ప్రజాసేవ చేస్తాం అని ప్రమాణం చేసిన నేతలు ఆస్తుల వివరాలు చెప్పేందుకు కూడా వెనకాడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. లోకాయుక్తకు ఆస్తుల వివరాలు ప్రకటించేందుకు ఏకంగా 140మంది శాసనసభ్యులు ససేమిరా అంటున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి లోకాయుక్తకు ఆస్తుల వివరాలను ఇంకా ప్రకటించలేదని సమాచార హక్కుచట్టం ద్వారా శుక్రవారం బహిరంగమైంది. నైజ హోరాటగారర వేదిక (వాస్తవ పోరాట వ్యక్తుల కూటమి) సంచాలకులు హెచ్ ఎం వెంకటేశ్ లోకాయుక్తకు సమర్పించిన పిటిషన్ ద్వారా సమాచారం వెలుగులోకి వచ్చింది. 88మంది శాసనసభ్యులు, 52మంది విధానపరిషత్ సభ్యులు ఉన్నట్లు సమాచారం. సాధారణ పౌరులు ఎవరైనా కాసింత అక్రమాస్తులతో పట్టుబడితే నానా హడావుడి చేసే అధికారులు బాధ్యత గల నేతలపై ఏమి చర్యలు తీసుకుంటారోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎన్నికల సమయంలో అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు తప్పనిసరిగా పొందుపరచాల్సి ఉంటుంది. మరి అందులో ఉన్నవి సరైనవా కాదా అన్నది కాలమే తేల్చాలి. ఆస్తులు వెల్లడించడానికి ఇష్టపడని వారిలో ప్రధానంగా డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రులు రామలింగారెడ్డి, కేహెచ్ మునియప్ప, మధుబంగారప్ప, డాక్టర్ ఎంసీ సుధాకర్, జమీర్ అహ్మద్, బోసరాజు, రహీంఖాన్, రాజణ్ణ ఉన్నారు. శాసన సభ్యుల్లో శ్యామనూరు శివశంకరప్ప, లక్ష్మణసవది, అశోక్‌పట్టణ, సిద్దూసవది, జగదీశ్ శివయ్య, గుడగుంటి, విజయానంద కాశప్పనవర్, బసనగౌడపాటిల్ యత్నాళ్, అల్లమప్రభు పాటిల్, ఖనీజా ఫాతిమా, జనార్ధనరెడ్డి, బసవరాజరాయరెడ్డి, రాఘవేంద్ర హిట్నాళ్, ప్రకాశ్ కోళివాడ, ఎన్‌వై గోపాలకృష్ణ, పుట్టస్వామిగౌడ, సుబ్బారెడ్డి, ప్రదీప్‌ఈశ్వర్, మునిరత్న, రూపకళ, సీకే రామమూర్తి, సతీశ్‌రెడ్డి, ధీరజ్ మునిరాజ్, హెచ్‌సీ బాలకృష్ణ, దర్శన్ పుట్టణ్ణయ్య, సీఎన్ బాలకృష్ణ, హెచ్‌డీ రేవణ్ణతోపాటు పలువురు ఉన్నారు. ఎమ్మెల్సీలలో ఉపసభాపతి ఎంకే ప్రాణేశ్, చీఫ్ విప్ సలీం అహ్మద్, హెచ్ విశ్వనాథ్, బీఎం ఫరూఖ్, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ప్రదీప్‌శెట్టర్, వైపె నారాయణస్వామి, కేపీ నంజుండి, రఘునాథరావు మల్కాపుర, రుద్రేగౌడ ఉన్నారు.





దొంగలతో.. దోస్తీ..!



- దోపిడీ ముఠాతో జతకట్టిన హెడ్ కానిస్టేబుల్
- చోరీలకు స్కెచ్ వేసేది ఆయనే ● గుట్టును రట్టు చేసిన ఎస్పీ
- సస్పెండ్ చేసి.. అరెస్ట్ చేసిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు, నగలు.. మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

బళ్లారి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కంచే చేను మేస్తే కాపాడేదెవరు? పోలీసులు దొంగలతో జట్టుకట్టి దోపిడీకి పాల్పడిన ఉదంతం బళ్లారిలో చోటుచేసుకుంది. దోపిడీ ముఠాలో హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నారు. ఆ ముఠాకు ఎప్పుడు ఎవరిని దోచుకోవాలనే విషయాన్ని ఆయనే చెబుతారు. ఇందుకు పూర్తి స్కెచ్ కూడా ఆయనదే. ఆ ముఠాలో ఒకరు మాజీ హోం గార్డు కూడా ఉన్నారు. సరిగ్గా పదిరోజుల క్రితం బెంగళూరు బజార్‌లోని రాయదుర్గం పాత బస్టాండు సమీపంలో అదీ బ్రూస్‌పేట్ పోలీస్టేషన్‌కు అతి సమీపంలో ఉదయం వేళ జరిగిన దోపిడీ కేసును ఎస్పీ శోభారాణి ఛేదించడంతో ఈ వివరాలన్నీ బయటపడ్డాయి. ఈ కేసు పూర్వాపరాలను ఎస్పీ శోభారాణి శనివారం తన కార్యాలయంలో మీడియాకు వివరించారు.

రఘు అనే బంగారు దుకాణం యజమాని ఈనెల 12న ఉదయం తన ద్విచక్రవాహనంపై 22,99,000 నగదు, 318 గ్రాముల బంగారం తీసుకుని వెళ్తున్నారు. అ సమయంలో ఎదురుగా ఒక వ్యక్తి వచ్చి కంట్లో కారం పొడి చల్లారు. అప్పుడు వ్యాపారి ద్విచక్రవాహనాన్ని పక్కన ఆపి కళ్లను రుద్దుకుంటేంటే ఎవరో వచ్చి స్కూటీ ముందు ఉంచిన బ్యాగును దోచుకుపోయారు. అప్పుడు అందులో నగదు, బంగారు ఉంది. ఈవిషయాన్ని అదేరోజు దగ్గరలోనే ఉండే బ్రూస్‌పేట్ పోలీస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఎస్పీ సూచనలతో పోలీస్ క్రైం క్లూస్ టీం రంగంలోకి దిగింది. దోపిడీ జరిగిన ప్రాంతం, అక్కడ ఉండే దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. విచారణలో ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.... నిందితులు హెడ్ కానిస్టేబుల్ పాత్రపై సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ మెహబూబ్ పాషా చోరీ సొమ్ములో తొమ్మిది లక్షలు అందుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడు తౌసిఫ్ జావీద్, పీరా, దాదా ఖలందర్, ముస్తాక్ అలీ, రెహమాన్, ఆరిఫ్, కరీం మొత్తం ఏడుగురు ఉన్నారు. హెడ్‌కానిస్టేబుల్ మెహబూబ్ పాషాను శనివారం అరెస్టు చేసి సస్పెండ్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డు ఆరిఫ్ భార్య బ్యూటీ పార్లర్ నడుపుతున్నారని, ఆమెతో హెడ్‌కానిస్టేబుల్ భార్యకు పరిచయం ఉందని తెలిపారు. దోపిడీ ముఠాలో సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తే పూర్తి వివరాలు వెల్లడయ్యాయన్నారు. దోపిడీ సొమ్ములో హెడ్‌కానిస్టేబుల్‌కు రూ. 9 లక్షలు ఇచ్చినట్లు నిందితులు ఎస్పీకి వివరించారు.

ఫేక్ న్యూస్‌తో ప్రమాదం

- సృష్టించేవారిపై చట్టపర చర్యలు : సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫేక్ న్యూస్‌తో సమాజానికి తీవ్ర ప్రమాదమని, అటువంటి వార్తలు సృష్టించేవారిపై చట్టపర చర్యలు తప్పనిసరి కావాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. శనివారం మైసూరులోని మానసగంగోత్రిలో పత్రికాదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ వాక్ స్వాతంత్ర్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. రాజ్యాంగంలోని 3 విభాగాలు సమాజానికి ప్రమాదం రాకుండా చూడాల్సిన బాధ్యత పత్రికలపై ఉందన్నారు. పత్రికారంగానికి ఎటువంటి నిర్బంధాలు ఉండరాదన్నారు. అయితే ఇటీవల ఫేక్‌న్యూస్ ద్వారా సమాజంలో శాంతి లేకుండా పోతోందన్నారు. శాసనసభలో ఒకప్పుడు మాట్లాడిన రుణమాఫీకి ప్రింటింగ్‌మిషన్ ఉందా... అంటూ ఉదహరించిన అంశాన్ని ఇటీవల గ్యారెంటీ పథకాలకు అనుసంధానం చేసేలా సృష్టించారన్నారు. ఇటువంటివారికి తగిన శిక్ష పడాలన్నారు. మంత్రి మహదేవప్ప, సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్, ప్రజావాణి సంపాదకుడు రవీంద్రభట్, గ్యారెంటీల అమలు సమితి అధ్యక్షుడు పుష్పాఅమరనాథ్, జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు దీపక్, కార్యదర్శి రవి పాండవపుర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రిజర్వాయర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 21: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో కర్ణాటక వాసి నీటిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కియ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పావగడకు చెందిన సంతోష్‌కుమార్(58) ఆరోగ్యం సరిగాలేక మనస్థాపానికి గురై రిజర్వాయర్‌లో పడి ఆత్మహత్య చేసుకున్నారు. హాసన్ జిల్లాకు చెందిన సంతోష్ కుమార్ పావగడలో పిల్లలకు ట్యూషన్ చెబుతూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కొన్నేళ్లుగా సంతోష్‌కుమార్‌కు వెరిటో వ్యాధితో బాధపడుతుం డేవాడు. పలుమార్లు చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడం ఆవేదనకు గురయ్యేవారు. సంతోష్ కుమార్ శనివారం మధ్యాహ్నం పావగడ నుంచి కారులో గొల్లపల్లి రిజర్వాయర్‌కు వచ్చాడు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతూ తాను చనిపోతున్నాని చెబుతూ రిజర్వాయర్‌లో దూకేశారు. రిజర్వాయర్‌లో తేలుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య సౌభాగ్యలక్ష్మీ, కుమారుడు ఉన్నారు.

శిరూరుగుట్టలో లారీ గుర్తింపు

- రెండు నెలల తర్వాత ఆచూకీ లభ్యం ● ఫలించిన అధికారుల ప్రయత్నాలు

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరులో జూలై 16న గుట్ట కుంగిపోయిన ఘటనలో



శిరూరులో కొనసాగుతున్న సహాయక చర్యలు

11మంది గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో 8మంది మృతదేహాలు లభించాయి. మిగిలిన ముగ్గురి కోసం సుదీర్ఘకాలం గాలింపు జరిపినా ప్రయోజనం లేకపోయింది. ఈ అంశం కర్ణాటక, కేరళ రాష్ట్రాల మధ్య తీవ్రమైన చర్చకు కారణమైంది. గుట్ట కుంగిన వేళ గంగావళి నదిలో కొట్టుకుపోయిన కేరళకు చెందిన అర్జున్ నడుపుతున్న లారీని ఎట్టకేలకు గుర్తించారు. దాదాపు నెలరోజులపాటు గాలింపు ప్రక్రియలు సాగించి నిలిపివేశారు. కేరళ సీఎం పినరాయ్ విజయన్, కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు అర్జున్ కోసం గాలింపు జరపాలని ఓ లేఖ పంపారు. తాజాగా గజ ఈతగాళ్ల ఈశ్వర్‌మల్పె బృందం గాలింపు కొనసాగించగా శనివారం లారీని గుర్తించారు. గంగావళి నదిలోనే లారీ ఉన్నట్లు గుర్తించారు. లారీ బోల్తా కొట్టినట్లు గజ ఈతగాళ్లు నిర్ధారించారు. లారీని నది నుంచి బయటకు తీసే కార్యాచరణ సాగుతోంది. రక్షణా సిబ్బంది రంగంలోకి దిగారు.

లారీని గుర్తించేందుకు ఎన్నెన్నో ప్రయోగాలు

గుట్ట కుంగిన ప్రాంతంలో అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్, హెచ్‌డీఆర్‌ఎఫ్ బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి. ఆ తర్వాత రాడార్ ద్వారా గాలింపు చేపట్టారు. ట్రక్, ట్యాంకర్‌లను గుర్తించారు. కానీ లారీ ఆచూకీ తెలియరాలేదు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ కమాండోలు కూడా గాలింపు జరిపాయి. రెండు నెలల తర్వాత లారీని గుర్తించారు. అయితే అర్జున్ ఆచూకీ మాత్రం లభించలేదు. అధికారులు గాలింపు చర్యలు చేస్తూనే ఉన్నారు.


సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అపారం

- ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, సెప్టెంబరు 21: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చడంతో పాటు చక్కటి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని ఉన్నత విద్యాశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పేర్కొన్నారు. తాలూకా పాలనాయంత్రాంగం, తాలూకా పంచాయతీ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంసి ఆంజనేయరెడ్డి కల్యాణమండపంలో శనివారం ఏర్పాటైన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల, కళాశాలల అభి వృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. రిటైరైన ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. ఎమ్మెల్సీ అనిల్ కుమార్, నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ్, ఉపాధ్యక్షురాలు రాణియమ్మ, బీఈఓ ఉమాదేవి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మునిరెడ్డి పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,620.43
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,742	6065
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,142	9,964
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	62.54

వర్షంతో ధ్వంసమైన హంపీ రోడ్డు



ఉప్పెన వాగు పోటెత్తడంతో ధ్వంసమైన రోడ్డు

కంప్లి, సెప్టెంబరు 21 : తాలుకా పరిధిలోని శ్రీరామ రంగాపురం (ఎస్ఆర్‌పుర) వద్ద కురుగోడు, హంపి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పెన వాగు పోటెత్తడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఎంతో మంది కురుగోడు తాలుకా వైపు గల గ్రామాల ప్రజలు యల్లాపుర, మారుతీ క్యాంపు, శ్రీరామరంగాపురం, దేవలాపురంకు చేరుకుని హంపికి ప్రయాణం కొనసాగించేవారు. ఈ వర్షం కారణంగా వాగులు పోటెత్తి పూర్తిగా ధ్వంసమై రోజులు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు స్పందించలేదని గ్రామస్తులు శ్రీనాథ్, యర్రప్ప, వెంకటనాయుడు, రామ్మూర్తి, రాఘవేంద్ర ఆచార్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రయాణికులకు, రైతులకు పూర్తిగా కష్టతరంగా మారింది. కావున ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు ధ్వంసమైన రోడ్డుపై దృష్టి సారించి వెంటనే మరమ్మతులుచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పరిశుభ్రత ఇంటినుంచే ప్రారంభం



పరిశుభ్రతను పాటిస్తామని ప్రమాణం చేస్తున్నదృశ్యం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21:పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి ఇంటి నుంచి ప్రారంభం కావాలని కెనరా బ్యాంక్ బళ్లారి ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. కెనరాబ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ప్రాంగణంలో స్వచ్ఛతా సేవా అభియాన్‌ను శనివారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మనం కూడా ప్రతిరోజు ఇందులో శిక్షణ పొందితే పరిశుభ్రతను కాపాడుకోవచ్చన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జిల్లాపంచాయితీ బళ్లారి ప్రాజెక్ట్ డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రతను మనస్ఫూర్తిగా పాటిస్తే రోగాల బారినపడకుండా ఉండవచ్చన్నారు. ఇంటి నుంచి గ్రామం, గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కెనరా బ్యాంక్ గిరీశ్ కులకర్ణి మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న పరిసరాలను, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈసందర్భంగా సీనియర్ మేనేజర్ రాజేశ్, కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ రాజేసాబు దినేశ్, జ డెప్ప, చిన్నప్ప, సిద్దలింగమ్మ, సంతోష్‌కుమార్, 30మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

నూతన ఆర్టీవోగా శ్రీనివాస్ గిరి బాధ్యతలు



బళ్లారిరూరల్, సెప్టెంబరు 21 : బళ్లారి జిల్లా నూతన ఆర్టీవోగా శ్రీనివాస్ గిరి బాధ్యతలు తీసుకున్నారు. శ్రీనివాస్ గిరి గత నాలుగు సంవత్సరాలుగా పలుచోట్ల సేవలందించి బళ్లారిలో శుక్రవారం బాధ్యతలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీనివాస్ గిరి 33 సంవత్సరాలుగా ఉత్తమ సేవలందించే అధికారి కావడంతో పలువురు అధికారులు నగర ప్రముఖులు పలు సంఘాల నాయకులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కంచే చేను మేస్తే...?

- సంచలనాత్మకంగా మారిన బళ్లారి దోపిడీ కేసు
- దొంగలముఠాతో చేతులు కలిపిన పోలీసులు
- నిర్ణయాత్మకంగా వ్యవహరించిన ఎస్పీ శోభారాణి



దోపిడీ కేసులో పట్టుబడిన నిందితులు

బళ్లారి సిటీ,సెప్టెంబరు 21: దొంగలు దొంగలు కలిసి చోరీకి పాల్పడడం సర్వసాధారణం. పోలీసులు దొంగలతో జట్టు కట్టి దోపిడీకి పాల్పడితే పరిస్థితి ఏమిటి? కంచే చేను మేస్తే కాపాడేదెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అటువంటి సంఘటనే ఇటీవల బళ్లారి నగరంలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన వ్యాపారి వేత్త రఘు సెప్టెంబరు 12వ తేదీ తెల్లవారుజామున కొంత నగదు, మరికొంత బంగారంతో ఉదయం బైక్‌పై రాయదుర్గం బస్టాండుకు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతడి కళ్లలో కారంపొడి చల్లారు. అతడు కళ్లు నులుముకుంటుండగానే దొంగలు అతడి వద్దనున్న నగదు బ్యాగ్‌ను ఎత్తుకుపోయారు. దోపిడీ అనంతరం రఘు బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇందులో ప్రధానంగా హెడ్ కానిస్టేబుల్ పాత్రపై సమాచారం అందించారు.

చోరీ సొమ్ములో సింహభాగం తొమ్మిది లక్షలు బ్రూస్‌పేట్ హెడ్ కానిస్టేబుల్ మెహబూబ్ పాషా అందుకున్నాడని పట్టుబడిన వారు తెలిపారు. దీంతో ఆశ్చర్యపోవడం అధికారుల వంతయింది. పాషా ఇంట్లో సోదాలు చేయగా చోరీకి పాల్పడిన రూ.9లక్షల నగదు లభ్యమైంది. అతడితోపాటు హోంగార్డుగా పనిచేస్తున్న ఆరీఫ్ కూడా ఈ నేరంలో భాగస్వామిగా మారడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గతంలో అతడికి పాషాతో స్నేహం ఏర్పడడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లా ఎస్పీ శోభారాణి చాకచక్యంగా వ్యవహరించి నిందితులను న్యాయస్థానానికి చేర్చారు.

అంతటితో ఆగకుండా డిపార్ట్‌మెంట్ పరువుపోతుందని అనుకోకుండా ఈ విషయాలను ఎస్పీ స్వయంగా విలేకరులకు వెల్లడించడం సంచలనాత్మకంగా మారింది. హెడ్ కానిస్టేబుల్ మెహబూబ్ పాషాను సస్పెండ్ చేయడమే కాకుండా అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. గతంలో సమీప జిల్లాలైన అనంతపురంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. ఇలా చేయడం ఇది మొదటి సారని, చెబుతున్నప్పటికీ గతంలో ఇటువంటి ఎన్ని కేసులు వెలుగులోకి రాకుండా పోయాయో తెలియదు. ప్రజల భద్రతకు పూచీపడతామని ప్రమాణాలు చేసి, పెద్దమొత్తంలో జీతాలు తీసుకుంటూ చోరీలకు పాల్పడేవారిని చూసి డిపార్ట్‌మెంట్‌లోని నిజాయితీగల పోలీసు అధికారులు తలవంచుకుంటున్నారు. దురాశకు ఇంతకంటే మించిన ఉదాహరణ ఉంటుందా?

స్కానింగ్ సెంటర్ల లోపాలపై సమాచారం ఇవ్వాలి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21: సిటీస్కానింగ్, ఎంఆర్ఐ, ఇతర స్కానింగ్ కేంద్రాల్లో లోపాలు కనిపిస్తే ప్రజలు, రోగులు జిల్లా కాంపిటెంట్ అథారిటీ, పీసీ కమిటీకి సమాచారం ఇస్తే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ అధికారి డా.రమేశ్‌బాబు తెలిపారు. నగరంలోని జిల్లా ఆసుపత్రి ఆవరణలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రినేటల్, ప్రసవానంతర లింగ నిర్ధారణ పద్ధతుల గురించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గర్భధారణకు ముందు, ప్రీ-నేటల్ పీటల్ డిటెక్షన్ టెక్నిక్‌లను సమర్థవంతంగా అమలు చేయడానికి చురుకైన చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించారు. జిల్లాలో ఏదైనా స్కానింగ్ సెంటర్లలో తప్పనిసరిగా గర్భిణీ చిరునామా, టెలిఫోన్ నంబర్‌తో సహా గర్భిణీ సమాచారాన్ని తప్పులేకుండా ఫారం -ఎఫ్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో 76 స్కానింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, గతమూడు నెలల్లో పీసీ, పీఎన్‌డీటీ కమిటీ 72స్కానింగ్ కేంద్రాలను సందర్శించిందని, లోపాలున్న 27 కేంద్రాలకు నోటీసులు జారీ చేశామన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో నిరుపయోగంగా యంత్రాలు ఉంటే జిల్లా కాంపిటెంట్ అథారిటీకి సమాచారం అందించవచ్చని తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ పూర్ణిమ కట్టిమని,డాక్టర్.శంభు, డాక్టర్.భావన, డాక్టర్ స్రవంతి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, అరుణ్‌కుమార్,గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

మంచి పౌరులకు ఆరోగ్యం చాలా ముఖ్యం

సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21: పిల్లలు శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుని మంచి పౌరులుగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా లీగల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె సూచించారు. జిల్లామానసిక ఆరోగ్య శాఖ, సమాచార పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యపరిరక్షణే ధ్యేయంగా ఆరోగ్యశాఖ ప్రతినెలా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ జీవితాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని తెలిపారు. జిల్లామానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి వీరేంద్రకుమార్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి ఆలోచనలు, భావాలు, ఇంద్రియాల ద్వారా చుట్టుప్రక్కల వాతావరణాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ విభాగం మనోచైతన్య కార్యక్రమం కింద శాంతిధామం ఆవరణలో ప్రతి రెండోశుక్రవారం ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించి చిన్నారులకు, మహిళలకు ఆత్మగౌరవంతో వైద్యం అందిస్తున్నామన్నారు. తదుపరి సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహన్ వానగుండి మాట్లాడుతూ దైనందిన జీవితంలో మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటూ మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో సవివరంగా వివరించారు. ఈసందర్భంగా జిల్లా చైల్డ్ వేల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డాక్టర్ నాగప్ప, ఈశ్వర్ దాసప్పనవర్, డా.మహేశ్వరీ, కళావతి, గంగమ్మ, మంజునాథ్, ఆరోగ్యశాఖ సిబ్బంది శాంతకుమార్, శర్మస్‌వలి, రంజిత, సహీరాబాను, పంచాక్షరయ్య, ప్రహ్లాద్‌రెడ్డి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

27న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ పర్యటన / సమాచారంతో సిద్ధం కావాలని ఏడీసీ సూచన

బళ్లారి సిటీ, సెప్టెంబరు 21: కర్ణాటక శాసనసభ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఈ నెల 27న జిల్లాలో పర్యటించి ఆ యా వర్గాల అభివృద్ధికి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్ తెలిపారు. కనుక జిల్లాస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన సప్లిమెంటరీ సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. నగరంలోని నూతన జిల్లా పాలనా భవనంలోని హాల్లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కమిటీ చైర్మన్ నరేంద్రస్వామి నేతృత్వంలోని 19 మంది సభ్యులు బళ్లారి జిల్లాలో పర్యటించనున్నారన్నారు. సెప్టెంబరు 27న వచ్చే కమిటీ సభ్యులను జిల్లా సరిహద్దులో ఆహ్వానించాలని, సరైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నారాయణస్వామి నేతృత్వంలోని ఈ కమిటీలో శాసనమండలికి చెందిన గోవిందప్ప, ఐహోళె దుర్యోధన మహాలింగప్ప, అబ్బయ్య ప్రసాద్, నారాయణస్వామి, కె.ఎం, మనప్పడి, వజ్జల,బసవనగౌడ దద్దాల,అనిల్ చిక్కమాదు, బసవరాజ్ మట్టిమూడ్, శ్రీనివాసయ్య, వీరేంద్రపప్పి, ప్రకాశ్ కోలివాడ, కృష్ణనాయక్, మంజు, కారమ్మ, శాంతారాం బుడ్నసిద్ధి, రాజేంద్ర రాజన్న, సతీశ్, జగదేవ్ గుత్తేదార్ తదితరులు సభ్యులుగా ఉన్నట్టు తెలిపారు. సెప్టెంబరు 27న జిల్లాపంచాయితీ హాల్లో ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, అందుకు అవసరమైన సన్నాహాలు చేపట్టాలన్నారు. అధికారులు తమ శాఖల పురోగతి సమాచారం, పనుల స్థితిగతులు, ఇతర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్సీఎస్పీ, టీఎస్పీ గ్రాంట్ వినియోగం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, ఉపయోగించని గ్రాంట్ తదితర సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించాలన్నారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు, స్కాలర్‌షిప్‌లు, పిల్లలను ముందుకు తీసుకురావడానికి అమలు చేస్తున్న పథకాల గురించి సమాచారాన్ని కలిగి ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి అక్కడ ఆహార సరఫరా నాణ్యత, పరిశుభ్రత తదితర మౌలిక వసతులను గమనించాలని, ఎలాంటి ఫిర్యాదులు చేయకూడదని చెప్పారు. ఈసందర్భంగా ఏఎస్పీ నవీన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీమల్లికార్జున, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మహ్మద్‌జుబేర్

బళ్లారిని ఆదర్శ జిల్లాగా మారుస్తా: ఎంపీ



వన్నళ్లి రోడ్డుకు భూమిపూజ చేపట్టిన ఎంపీ తుకారామ్

కంప్లి, సెప్టెంబరు 21 : బళ్లారి, విజయనగర జిల్లాలను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాలుగా అభివృద్ధి చేస్తామని ఎంపీ తుకారామ్ తెలిపారు. శనివారం గంగలాపురం, ఆలూరు, బన్నేహట్టి, లింగదహళ్లి, మాలాపుర, తిమ్మలాపుర, ఏళుబెంచి, వన్నెళ్లి గ్రామాల రోడ్లకు ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తమ సండూరు నియోజకవర్గంలో ఎలా అభివృద్ధి చేపట్టామో బళ్లారి విజయనగర జిల్లాలు, తాలుకాల్లో కూడా అలాగే అభివృద్ధి చేపడతామన్నారు. అలాగే కుడితిని, సిద్ధమ్మనహళ్లి రైల్వే బ్రిడ్జి ఫ్లైఓవర్ పనులు కూడా త్వరగా ముగించి గ్రామస్థులకు, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలన పూర్తిగా అభివృద్ధి పాలన అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరేష్ శాస్త్రి, గంగన్న, హనుమంతప్ప, వినాయక, రామచంద్రప్ప, రాజశేఖర్, చంద్రప్ప, పల్లెద ప్రభు, ఏళుబెంచి గ్రామస్తులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎంపీ తుకారామ్ భూమిపూజ

తోరణగల్లు, సెప్టెంబరు 21 : బళ్లారి పార్లమెంట్ సభ్యుడు తుకారామ్ వివిధ పనులకు శనివారం భూమి పూజ నిర్వహించారు. గంగలాపురం నుండి ముఖ్య రోడ్డు వరకు వెళ్లే రహదారికి భూమిపూజ నిర్వహించారు. తాళూరు గ్రామం నుండి భువనహళ్లి వరకు రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేశారు. బన్నిహట్టి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆరు రూములను ప్రారంభించారు. అనంతరం ఎస్‌హెచ్131 నుండి లింగదహళ్లి గ్రామం వరకు రోడ్ల అభివృద్ధికి, సండూరు లోని బెళగల్ బన్ని హట్టి, రాజాపుర, మెట్రిక్ రోడ్డుకి, అంతాపుర గ్రామ పరిమితిలో మురికి కాలువ నిర్మాణానికి, సిద్ధమనహళ్లి వంతెన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

నాగరాజుగౌడకు ఛాయాశ్రీ అవార్డు



ఛాయాశ్రీ అవార్డు అందుకుంటున్న నాగరాజుగౌడ

కంప్లి, సెప్టెంబరు 21 :కంప్లిలో గత 20 సంవత్సరాలుగా మెట్రి గ్రామానికి చెందిన బి నాగరాజుగౌడకు బెంగళూరు పట్టణంలో ఫోటోగ్రాఫర్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చేపట్టిన సేవలు, పర్యటనలు గుర్తించి ఆయనకు ఛాయాశ్రీ అవార్డును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను గుర్తించి బెంగళూరు పట్టణంలో ఫోటోగ్రాఫర్ ప్రతినిధుల సంఘం వారు తనకు అవార్డు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ముమ్ముందు ఫోటోగ్రాఫర్లు ఐక్యతగా వుంటూ ఏ సమస్య వచ్చినా ఎదుర్కొని ముందుకు ప్రయాణిద్దామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు చేసే పనులకు పట్టుదల, దీక్ష, క్రమశిక్షణ వుంటే తాము ఎదగగలమని తెలిపారు. కార్యక్రమంలో కంప్లి తాలుకా పరిధిలోని ఫోటోగ్రాఫర్‌లు ఆయనకు అవార్డు రావడంతో అభినందించారు.

మోదీ జన్మదినం సందర్భంగా రక్తదానం



కార్యకర్తలు రక్తదానం చేస్తున్న దృశ్యం

సిరుగుప్ప, సెప్టెంబరు 21 : దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ కార్యకర్తలు స్వయంప్రేరిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప మాట్లాడుతూ నరేంద్రమోదీ దేశ అభివృద్ధి కోసం ఎంతో పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి శేఖర్‌గౌడ, బెళగల్ బసవరాజ, మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, సెప్టెంబరు 21: సిరుగుప్ప పట్టణం దేశనూరురోడ్డు మార్గంలో వెలసిన పేటే ఆంజనేయస్వామి దర్శనానికి శనివారం పురస్కరించుకుని భక్తులు బారులు తీరారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి చేపట్టారు.

హోసూరు జోన్

మెగా గ్లోబల్ స్పేస్ ఎక్స్‌పోలో హోసూరు విద్యార్థులు



ఎక్స్‌పోలో పాల్గొన్న అధియమాన్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు

హోసూరు సెప్టెంబరు 21: బెంగళూరులో మూడు రోజుల పాటు జరిగిన మెగా గ్లోబల్ స్పేస్ ఎక్స్‌పో, కాన్ఫరెన్స్‌లో హోసూరు నగరానికి చెందిన అదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సులో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్, డాక్టర్.సోమనాథ్ మాట్లాడుతూ, భారతదేశంలో అత్యుత్తమ పరికరాలు, అత్యుత్తమ రాకెట్లను తయారు చేయగల సామర్థ్యం తమకు ఉందని గత దశాబ్ద కాలంల్లో భారత అంతరిక్ష పరిశ్రమ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ఇస్రో తీవ్రమైన , దృఢమైన ప్రయత్నాల వల్లనే అంతరిక్ష కార్యక్రమాలు ముందుకు వెళుతున్నాయని తెలిపారు. గ్లోబల్ ఏరోస్పేస్ విలువ 2030 నాటికి యూఎస్‌డీ 642 బిలియన్లకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. భారత దేశ అంతరిక్ష విభాగం తన మొదటి ప్రయత్నంలోనే మార్స్ ప్రోబ్స్‌ను విజయవంతంగా ప్రయోగించి వందలాది విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లడంలో, ఉపగ్రహాలను అభివృద్ధి చేయడంలో గుర్తింపు పొందిందన్నారు. గ్లోబల్ ఏరోస్పేస్ ఎకానమిలో భారతదేశం 2-3 శాతం వాటాను కలిగి ఉందన్నారు.

రహదారులపై తరచూ ప్రమాదాలు

హోసూరు, సెప్టెంబరు 21 : హోసూరు జాతీయ రహదారిపై గత రెండు నెలల నుంచి రాత్రి వేళల్లో లైట్లు వెలగకపోవడం, జాతీయ రహదారిపై ఉన్న ఇనుప డివైడర్ కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బెంగళూరు నుంచి చెన్నై జాతీయ రహదారి రాష్ట్రాలను కలిపే ప్రధాన జాతీయ రహదారి. ఈ హైవేలో పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాలు తిరుగుతున్నాయి. రాష్ట్ర సరిహద్దు కావడంతో స్థానిక ట్రాఫిక్ చెక్ పోస్టు, మద్యం మినహాయింపు విభాగం చెక్ పోస్టు , పోలీసులు ఇక్కడ ఉన్నారు. ఇక్కడ వాహనాలను తనిఖీ చేసిన తర్వాతే వాహనాలను ముందుకు సాగేందుకు అనుమతిస్తారు. ఈ పరిస్థితిలో గత రెండు నెలలుగా రాత్రి వేళల్లో లైట్లు వెలగకపోవడంతో ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు , లారీలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

రూ.70 వరకు పెరిగిన నూల్‌కోల్ ధర

హోసూరు, సెప్టెంబరు 21: హోసూరు, బాగలూరు, బేరికై, శూలగిరి, తళి, అంచెట్టి, రాయకోట, పోచ్చంపల్లి, బరుగూరు, కావేరిపట్టణం, తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో రైతులు నూల్‌కోల్ సాగు చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లాలోటమోటా, బీన్స్, ముల్లంగి, క్యారెట్ , బీట్‌రూట్,కొత్తిమీర, పుదీనా, పాలకూర తదితర కూరగాయలు పండిస్తారు. ఇక్కడ పండే కూరగాయలను తమిళనాడుకే కాకుండా చెన్నై, బెంగళూరు, హోసూరు, రాయకోట్టై, కోయంబత్తూరు తదితర రాష్ట్రాలకు పంపుతున్నారు. ఈ పరిస్థితిలో అన్ని కూరగాయలను రైతులు 250 నుంచి 300 ఎకరాల వరకు పండిస్తున్నారు. ఇందులో నూల్‌కోల్ ధర కిలోకు రూ.70 పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాయచూరులో అక్రమ కట్టడాల కూల్చివేత



స్టేషన్ రహదారి వద్ద ఉన్న అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

రాయచూరు సెప్టెంబర్ 21 :నగరంలో గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా వెలసిన ఆక్రమణల తొలగింపును నగరసభ చేపట్టింది. స్టేషన్ రహదారిలోని రెండంతస్తుల బిల్డింగ్‌ని శనివారం కూల్చివేయడం ద్వారా నగరసభ అధికారులు తన కార్యచరణను ప్రారంభించారు. స్టేషన్ రోడ్డులో సునిల్ అగరవాల్‌కు చెందిన రెండంతస్తుల భవనం పాదాచారులు నడిచే ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించారని ఇప్పటికే ఫిర్యాదులందగా దాన్ని పరిశీలించిన అధికారులు ఆక్రమణ తొలగింపు చేపట్టారు. రెండు ఎక్స్కవేటర్ యంత్రాల సహాయంతో చేపట్టిన ఆక్రమణల తొలగింపు రసాభాసగా మారింది. ఇంటి యజమానులు నగరసభ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు తాము ఆక్రమణ చేసినట్లు ఉంటే నోటీసులు ఇవ్వాలని ఇలా ఏకపక్షంగా కూల్చడమేమిటంటూ ప్రశ్నించారు. అయినా అధికారులు దాన్ని ఖాతరు చేయకుండా కూల్చివేతలు ప్రారంభించారు. తహసిల్దార్, నగరసభ కమిషనర్ పోలీస్ బందోబస్తుతో కార్యాచరణ చేపట్టారు. కాగా నగరంలో ఇప్పటికే అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరిగాయంటూ ఫిర్యాదులు అందగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన నగరసభ అధికారులు కూల్చివేతలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నగరసభ, ఆర్డీఏ, అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, ఇతర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఆక్రమణల తొలగింపుకు సిద్ధపడినట్లు అధికారులు తెలిపారు.

శాంతి, సహృదయత.. నేటి సమాజానికి అత్యవసరం

- రాయచూరు వర్సిటీ వీసీ డాక్టర్ జీఎస్ బిరాదర్

రాయచూరు సెప్టెంబర్ 21 :భిన్నాభిప్రాయాలు, ఘర్షణలు, పోరాటాలకు ఆలవాలంగా మారుతున్న నేటి పరిస్థితుల్లో సమాజానికి శాంతి, సహృదయత అత్యవసరమని రాయచూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జీఎస్ బిరాదర్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, యూత్ రెడ్ క్రాస్ శాఖ, జిల్లా పంచాయతీల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రంగమందిరంలో ఏర్పాటు చేసిన శాంతి దినాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. శాంతి దినాచరణ పేరుతో ప్రపంచంలోని 185 దేశాలు శాంతి కోసం ప్రయత్నం చేస్తున్నాయని అందులో భారతదేశం భాగస్వామిగా ఉండడం గర్వకారణమన్నారు. కాగా శాంతి సౌహృదయంతోనే పురోగతి ముడిపడి ఉందని శాంతియుత సహజీవనంతో ఉండే మానసిక లక్షణాన్ని అందరూ పెంపొందించుకోవాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గురునానక్ (వర్ధంతి)



సిక్కుమత గురువు గురునానక్ దేవ్ 1469 ఏప్రిల్ 15న లాహోర్‌లో జన్మించారు. హిందూ, ఇస్లాం గ్రంథాలను చదివి భిన్నమైన 'సిక్కు' మతాన్ని స్థాపించారు. పదిమంది సిక్కు గురువులలో తొలివ్యక్తి. ఏకేశ్వరోపాసనను ప్రబోధించి కుల వ్యవస్థను వ్యతిరేకించిన గురువు. నానక్ తర్వాత గురు పరంపర కొనసాగింది. మతసామరస్య బోధనలు చేశారు. సత్యం, అహింస ఆయన సిద్ధాంతాలలో ముఖ్యమైనవి. పవిత్ర గ్రంథమైన గురుగ్రంథ్ సాహిబ్‌లో ఎన్నో అంశాలను ప్రస్తావించారు. మానవత్వం, జాలి, దయ, ప్రేమను ఆచరించడం వంటివి ప్రధాన వాణిగా ఉంది. 1539 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

పీబీ శ్రీనివాస్ (జయంతి)



నుదుటన తిలకం, తలపాగా ధరించడంతో విలక్షణంగా కనిపించి సినీ నేపథ్య గాయకుడు ప్రతివాది భయంకర (పీబీ) శ్రీనివాస్ 1930 సెప్టెంబరు 22న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. మాతృభాష తెలుగు కంటే కన్నడ, తమిళ సినిమాలలో ఎక్కువ పాటలు పాడారు. అంతేకాక మళయాళ, తుళు, కొంకణి, హిందీ భాషలలో సైతం పాటలు పాడారు. కవిగా 8 భాషలపై పట్టు కలిగినవారు. స్వరకర్తగా, హార్మోనియం కళాకారుడు, గేయ రచయిత, సాహితీవేత్త, కవిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో గజల్స్ కూడా రాశారు. 12భాషల సినిమాల్లో పాటలు పాడారు. మూడు దశాబ్దాలపాటు కన్నడ సినీ రంగాన్ని ఏలారు. కన్నడ కంఠీరవుడు రాజ్‌కుమార్‌కు ఎన్నో పాటలు పాడారు. కన్నడ రాజ్యోత్సవ, కలైమామణి, నాడోజ, కలైవనర్ తదితర పురస్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

అశోకమిత్రన్ (జయంతి)



కలం పేరు అశోకమిత్రన్‌తో పేరొందిన రచయిత జగదీశ త్యాగరాజన్ 1931 సెప్టెంబరు 22న సికింద్రాబాద్‌లో జన్మించారు. తమిళ సాహిత్యంలో ఎంతో పేరొందారు. 'కనైయాజి' పత్రికకు సంపాదకులు. 200కుపైగా చిన్నకథలు, 8 నవలలు రాశారు. అత్యధిక రచనలు ఆంగ్లంతోపాటు హిందీ, మళయాళం, తెలుగులోకి అనువాదం అయ్యాయి. సాహిత్య అకాడమీ, అక్షర అవార్డు, ఎన్టీఆర్ నేషనల్ లిటరరీ అవార్డుతోపాటు పలు అవార్డులు దక్కాయి. 2017 మార్చి 23న కన్నుమూశారు.

మార్టిన్ క్రో (జయంతి)



మార్టిన్ డేవిడ్ క్రో 1962 సెప్టెంబరు 22న జన్మించారు. న్యూజిలాండ్ క్రికెటర్. టెస్ట్, వన్డే కేప్టెన్‌గాను, కామెంటేటర్‌గా రాణించారు. న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టులో 1982 నుంచి 1995 మధ్య ఆడారు. దేశంలోనే గొప్ప బ్యాట్స్‌మెన్‌గా పేరొందారు. 1985లో విజ్డన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ యంగ్ బ్యాట్స్‌మెన్ ఇన్ ది వరల్డ్‌గా గుర్తింపు పొందారు. 1992లో వరల్డ్‌కప్ పోటీల్లో జట్టును సెమీఫైనల్ దాకా తీసుకెళ్లారు. వన్డేలలో 21 సెంచరీలు చేశారు. ఆటనుంచి రిటైరయ్యాక రైటర్‌గా, కామెంటేటర్‌గా వ్యవహరించారు. 2016 మార్చి 3న కన్నుమూశారు.

సాంకేతిక విద్యలో రాణించండి

» ఎస్ఎల్‌కే గ్రూప్ ముఖ్యులు వీరేంద్రనాథ్



కోర్సుల ప్రారంభోత్సంలో వీరేంద్రనాథ్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో రాణించేలా ప్రతి విద్యార్థి నైపుణ్యత పొందాలని ఎస్ఎల్‌కె గ్రూప్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ వీరేంద్రనాథ్ సూచించారు. రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్‌సైన్స్ ఆధ్వర్యంలో బిటెక్ కోర్సులను పీణ్యా క్యాంపస్‌లో లాంఛనంగా ప్రారంభించారు 1500మంది విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. ప్రొ-వైస్ చాన్స్‌లర్, డీన్ ప్రొఫెసర్ గోవింద్ ఆర్ కడంబి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరేంద్రనాథ్ మాట్లాడుతూ నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో రాణిస్తే విశ్వవ్యాప్తంగా ఉద్యోగాలు సాధ్యమన్నారు. చదువుతోపాటు ఇతరులతో ఎలా వ్యవహరించాలనేది నేర్చుకోవాలన్నారు. ప్రస్తుతం పారిశ్రామిక వాతావరణం దేశంలో ఆశాజనకంగా ఉందన్నారు. వైస్ చాన్స్‌లర్ కులదీప్‌కుమార్ రైనా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను పాటించాలన్నారు. ఇంజనీరింగ్ కోసం 49వేల దరఖాస్తులు స్వీకరించామని, అన్ని విభాగాలకు కలిపి 3,500 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చామన్నారు. యూనివర్సిటీ నాక్ ఏ+ గుర్తింపు పొందిందని, 130 ప్రోగ్రామ్‌లు ఉన్నాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సహనా పి శంకర్, అసోసియేట్ డీన్ నయనా ఎం పాటిల్‌లు భాగస్వామ్యులయ్యారు. మెడికల్ సైన్స్ విభాగం ప్రొ-వైస్ చాన్స్‌లర్ ఓంప్రకాశ కరబంద మాట్లాడుతూ పర్యావరణ ఆరోగ్యంపై విద్యార్థులు సవాళ్లను పరిష్కరించేవారు కావాలన్నారు. పరిసరాల శుభ్రత ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు.

కాగా న్యూ బీఈఎల్ రోడ్డులోని జ్ఞానగంగోత్రి రామయ్య విద్యాసంస్థల క్యాంపస్‌లో ఫార్మసీ విభాగం తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. బెంగళూరు విభాగం డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ జే భాస్కరన్ ముఖ్యులుగా పాల్గొని విద్యార్థులకు ఫార్మసీ విభాగంలో వ్యవహరించాల్సిన విధానాలు, మెళకువలను వివరించారు. సుమారు వెయ్యిమందికిపైగా భాగస్వామ్యులయ్యారు.

లూమియర్ పురస్కారాల ప్రదానం

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పెట్టుబడులు, సుస్థిర జీవనశైలి అన్వేషించేలాంటి పారిశ్రామిక ప్రముఖులకు ఐఏఎస్ఎల్ బ్రాండ్ ట్రాక్ లూమియర్ పేరిట పురస్కారాలు ప్రదానం చేసింది. గ్రాంట్ థారంటన్ భారత్ ఆఫీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఫతేమా హౌనాల్డ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్యులు ఆనంద్‌షాలతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫతేమా హౌనాల్డ్ మాట్లాడుతూ పెట్టుబడులు సాధించేందుకు రోడ్‌షోలు, ఆధునిక పురోగతికి సదస్సులు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో బ్రాండ్ ట్రాక్ సీఈఓ మనుశ్రీదత్తా, జేఎస్‌డబ్ల్యు వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ సచిన్‌తాగ్రా, జోషి బబ్బు, పల్లవితోపాటు పలువురు పాల్గొన్నారు. బ్రాండ్‌ట్రాక్ సంస్థ ఫౌండర్ సీఈఓ మధుశ్రీ దత్తా మాట్లాడుతూ భారత్‌వైపు వివిధ దేశాలు వ్యాపార సంబంధాలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు.

పిల్లలకు క్రమశిక్షణ నేర్పండి: ఎమ్మెల్యే



ఉపాధ్యాయులకు సన్మానంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, సెప్టెంబరు 21: పిల్లలకు విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాల, కళాశాల పాలకమండలుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతోపాటు ఉత్తమ భవిష్యత్తు తీర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బోధనలో తారతమ్యం ఉండరాదని, పిల్లలందరి సర్వతోముఖాభివృద్ధికి శ్రమించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దులో ఉన్న తాలూకాలో గతంలో మెడికల్, ఇంజనీరింగ్, ఐఏఎస్ వంటి సాధకులు ఉన్నారన్నారు. ఇటీవలికాలంలో ఈ సంఖ్య పెరుగుతోందని ఇందుకు ఉపాధ్యాయుల శ్రమ కారణమన్నారు. 150మందికిపైగా మెడికల్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు లెక్కేలేదన్నారు. పాఠశాల, కళాశాల మండలులు పిల్లలకు గుణాత్మక విద్య, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొంత మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈసందర్భంగా అన్‌ఎయిడెడ్ పాఠశాల, కళాశాల మండలుల సమాఖ్య అధ్యక్షుడు వై శ్రీనివాసరెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎన్ శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సభ్యురాలిపై చర్యకు డిమాండ్



డీఎస్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

శిడ్లఘట్ట, సెప్టెంబరు 21: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల తప్పుగా మాట్లాడిన గ్రామ పంచాయతీ సభ్యురాలు శశికళ అంబరీశ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని దళిత సంఘర్ష సమితి తాలూకా సంచాలకులు టీపీ చలపతి డిమాండ్ చేశారు. తాలూకాలోని వెంకటాపుర గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద డీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ధర్నాకు నేతృత్వం వహించి మాట్లాడారు. స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలైనా దేశాన్ని వివిధ పార్టీలు అధికారం కొనసాగించాయన్నారు. రాజ్యాంగబద్ధంగా గ్రామపంచాయతీ సభ్యురాలిగా ఎన్నికైన శశికళ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల అవహేళనగా మాట్లాడడం ఖండనీయమన్నారు. పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అంబేడ్కర్ పట్ల అవమానంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్ఎస్ సభ్యులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛ రాజకీయాలకోసం పార్టీని బలోపేతం చేయాలి



కేఆర్ఎస్ తాలూకా అధ్యక్షుడు శివశంకర్

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 21: స్వచ్ఛ రాజకీయాలకోసం పార్టీని బలోపేతం చేయాల్సి ఉందని కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్) పార్టీ బెంగళూరు గ్రామీణ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ అభిప్రాయపడ్డారు. పార్టీ తాలూకా పదాధికారులుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు చేరి ప్రముఖులంతా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా బలోపేతం చేయాల్సి ఉందన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నూతన పదాధికారుల బాధ్యతలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఉద్దేశ్యం స్వచ్ఛ, ప్రామాణిక, అవినీతి రహిత పాలన కల్పించడమే అన్నారు. లూటీకోరుల రాజకీయ నాయకులను సమాజంనుంచి తరిమేయాలన్నారు. సామాజిక చైతన్యం, జనస్నేహి నాయకులను పార్టీకి అవసరమన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలు సరిలేవన్నారు. తాలూకా అధ్యక్షుడు కేవీ నాగరాజు మాట్లాడుతూ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి పాటుపడేందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. తాలూకా విభాగం నూతన పదాధికారులలో అధ్యక్షుడు కేవీ నాగరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మురహరి, కార్యదర్శిగా మంజునాథ్, కార్యదర్శిగా పాపణ్ణ, సంయుక్త కార్యదర్శిగా గౌతమ్ గంగప్ప, సంఘటనా కార్యదర్శిగా బాలకృష్ణ ఎంపికయ్యారు. నూతన పదాధికారులను అభినందించారు.

క్రీడలతో ఒత్తిడి నియంత్రణ



షాట్‌పుట్ పోటీల్లో పురసభ అధ్యక్షుడు, తదితరులు

బంగారపేట, సెప్టెంబరు 21: దైనందిన విధి నిర్వహణలో ఉండే పౌరకార్మికులకు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి నియంత్రణతోపాటు ఉత్తమ ఆరోగ్య సాధ్యమని పురసభ అధ్యక్షుడు గోవింద అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం పౌరకార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పౌరకార్మికులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద మాట్లాడుతూ పలు రకాల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయన్నారు. పౌరకార్మికులు కేవలం స్వచ్ఛతా పనులకే పరిమితం కాకుండా అప్పుడుప్పుడు క్రీడ, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసం పొందాలన్నారు. పురసభ ముఖ్యఅధికారి సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛతా పనులలో మాస్క్, గ్లవ్స్ ధరించాలని సూచించారు. మహిళా పౌరకార్మికులకు క్రికెట్, లెమన్‌స్పూన్, మ్యూజికల్ చెయిర్, పురుషులకు షాట్‌పుట్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పురసభ సభ్యులు రాకేశ్‌గౌడ, వసంత్, పొన్ని రమేశ్, షఫి, సౌందర్యప్రభాకర్‌రావ్ పురసభ అధికారులు సంతోష్, గోవిందరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువధశాలపై

పోలీసుల దాడి

మాంసం, ఎముకలు, కొమ్ముల స్వాధీనం... నలుగురి అరెస్టు

గోరంట్ల, సెప్టెంబరు 21: మండలంలోని పులేరు రహదారిలో పొలంలో నిర్వహిస్తున్న పశువధకేంద్రంపై సీఐ శేఖర్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడి చేశారు. రెండు గూడ్స్ వాహనాలు, ప శుమాంసం, ఎముకలు, కొమ్ములను స్వా ధీనం చేసుకున్నారు. నిర్వాహకులు దస్తగిరి, అల్లాబక్ష, సల్మాన్, ఫైజల్‌ను అరె స్టు చేశారు. కొంతకాలంగా పశువధ కేంద్రం ద్వారా ఆవులు, లేగ దూడలను వధించి, మాంసాన్ని ప్రత్యేక గూడ్స్ వాహనాల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్, పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు.. సి బ్బందితో కలిసి వధశాలపై దాడి చేశా రు. ముందుగానే పోలీసులను గుర్తించిన నిర్వాహకులు అప్పటికే వధించిన 25 ఆవులు, దూడల మాంసాన్ని రెండు వా హనాల్లో కర్ణాటకకు తరలించే ప్రయత్నం చేశారు. వధించడానికి సిద్ధంగా ఉంచిన పది ఆవులను మరో వాహనంలో ఎ క్కించారు. జాగ్రత్త పడిన నిర్వాహకులు క్షణాల్లో మూడు వాహనాలతో ఉడాయించారు. దీంతో అక్కడున్న ఒక ఆటో, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి, అందులోని పశు మాంసం, ఎముకలు, అక్కడున్న మూడువందల పశువుల కొమ్ములను పో లీసులు గుర్తించారు. సమీపంలోని వంక లో మాంసం వ్యర్థాలను పెద్దఎత్తున పూ డ్చి వేసిన ప్రాంతాన్ని గుర్తించారు. పట్టుబడిన నలుగురితోపాటు దస్తగిరి కుమారులైన బాబ్‌జాన్, రిజ్వాన్, ఫైజా, తౌహీద్‌పై కేసు నమోదు చేసి, తరలించిన మూడు వాహనాలకోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న కలర్‌ఫుల్ విస్పర్స్ ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మతిమరుపుతోపాటు బుద్ధి మాంద్యత వంటి జబ్బులతో బాధపడేవారిని ప్రతి ఒక్కరూ ఆదరించాలనే కోణంలో కలర్‌ఫుల్ విస్పర్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రకళాప్రదర్శన ఆకట్టుకుంది. కైట్స్ సీనియర్ కేర్ ప్రాంగ ణంలో దొమ్మలూరులోని బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రపంచ అల్జీమర్స్ డేను చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనశీలత, మనోభావాలను దెబ్బ తీసేలా సీనియర్ సిటిజన్‌ల పట్ల అనుచితంగా వ్యవహరించరాదన్నారు. లైఫ్ బ్రిడ్జ్ సీనియర్ కేర్ సీఈఓ రీమానాడిగ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను పలువురు తిలకించారు.

రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా విజయలక్ష్మి బాధ్యతలు

అనంతపురం క్రైం,సెప్టెంబరు 21: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా విజయలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న మా ధవిని ఏలూరు డీఐజీగా బదిలీ చేస్తూ... ఆమె స్థానంలో విజయనగరం డీఐజీగా పనిచేస్తున్న విజయలక్ష్మిని నియమించారు. బాధ్యతలు చేపట్టిన డీఐజీని అనంతపురం, రూరల్ సబ్ రిజిస్ట్రార్లు ఇస్మాయిల్, టీజీ రెడ్డి, ఇతర సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవీ స్వీకారం



పదవీ బాధ్యతలు చేపట్టిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అభినందన

శిడ్లఘట్ట, సెప్టెంబరు 21: శిడ్లఘట్ట నగరసభ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు శుక్రవారం పదవీ స్వీకారం చేశారు. నగరసభ కమిషనర్ మంజునాథ్ స్వయంగా నూతన అధ్యక్షుడు ఎంవి వెంకటస్వామి, ఉపాధ్యక్షురాలు ఇ రూప నవీన్‌లకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. నగరసభ నూతన అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ మార్గదర్శకంలో ప్రామాణికంగా పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను నగరసభ సభ్యులు, సిబ్బంది, ప్రముఖులు అభినందించారు.

జే బ్రాండ్లకు బై.. బై..

జగన్ మద్యానికి చెల్లుచీటీ..

గత ఐదేళ్లూ మందుబాబులకు అవస్థలు

పెంచిన ధరలతో జేబులకు చిల్లు

యథేచ్ఛగా కర్ణాటక మద్యం రవాణా

బ్రాండెడ్ మద్యం సరఫరాకు నిర్ణయం

ధర కూడా అందుబాటులోనే.. కొత్త పాలసీకి ఓకే

జిల్లాలో 72 దుకాణాలకు సన్నాహాలు

పుట్టపర్తి సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యంప్రియులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రజల ప్రాణాలు తోడేస్తున్న జే బ్రాండ్లను పక్కనపెట్టి, పాపులర్ బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. అది కూడా అందుబాటు ధరలోనే. దీంతో మద్యం ప్రియులకు కిక్కే.. కిక్కు. గత వైసీపీ ఐదేళ్ల పాలన ఆద్యంతం మద్యంబాబులు తిప్పలు పడ్డారు. ధరలు విపరీతంగా పెంచడంతో కొనలేక ఇబ్బందులకు లోనయ్యారు. అంత రేటు పెట్టి కొనుగోలు చేసినా.. బ్రాండెడ్ మద్యం దొరకదు. లోకల్ మద్యమే దిక్కు. విధిలేక దానినే తాగిన వేలాదిమంది ఆస్పత్రుల పాలయ్యారు. అనేక అనారోగ్య సమస్యలతో నేటికీ సతమతమవుతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకుంది. ఇష్టానుసారం ధరల నిర్ణయించి ఆపార్టీ నాయకుల డిస్టిలరీల్లో తయారు చేసిన నాసిరకం రంగు నీళ్ల మద్యాన్ని విక్రయించింది. రూ.వేల కోట్లు కొల్లగొట్టారు. ఆ అడ్డగోలు మద్యం విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. నూతన విధానాన్ని తెరమీదికి తెచ్చింది. అందుబాటులో ధర, నాణ్యమైన మద్యం సరఫరా చేయాలనీ, ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. నూతన ఎక్సైజ్ పాలసీకి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదంతో జిల్లాలో మద్యం షాపుల నిర్వహణదారుల్లో సందడి మొదలైంది. నోటిఫికేషన్ విడుదలే తరువాయి. దుకాణాల కోసం గతంలోలా తీవ్రపోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు చెక్ పడనుంది. సరిహద్దులో రాత్రింబవళ్లు కాపలా కాయాల్సిన తిప్పలుండవని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

బ్రాండ్ల కిక్

మద్యం ధరలు, రిటైల్ వ్యాపారం, పన్నులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన సంగతి తెలిసిందే. దుకాణాల్లో నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తేవాలనీ, క్వార్టర్ బాటిల్ రూ.99కే అందించాలని నిర్ణయించింది. గత వైసీపీ హయంలో పాపులర్ బ్రాండ్లు బదులుగా ఆపార్టీ నాయకుల డిస్టలరీల్లో తయారు చేసిన నాసిరకం బ్రాండ్లు మద్యంబాబులను బెంబేలెత్తించాయి. ఇక్కడ దొరికే నాసిరకం మద్యం తాగలేక జిల్లావాసులు కర్ణాటక మద్యానికి జైకొట్టేవారు. దీంతో సరిహద్దు కర్ణాటక నుంచి జిల్లాలోకి ప్రవేశించిన కర్ణాటక మద్యం ఏరులైపారింది. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కర్ణాటక పాలైంది. సరిహద్దులోని హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో కర్ణాటక మద్యం గొలుసు దుకాణాలతో స్థానిక దుకాణాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కర్ణాటక మద్యం రవాణాతో రూ.కోట్లు వెనుకేసుకున్నారు. రెండేళ్లలో కేవలం సెబ్ దాడుల్లో రూ.4కోట్ల విలువ చేసే 47,483 లీటర్ల కర్ణాటక మద్యం పట్టుబడిందంటే జిల్లాలోకి ఏస్థాయిలో తరలివచ్చిందో అర్థం చేసుకోవచ్చు. కర్ణాటకలో చీప్ లిక్కర్ క్వార్టర్ సీసా ధర రూ.80కి విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో నాణ్యమైన మద్యాన్ని రూ.99కంటే తక్కువ ధరకు ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఫలితంగా జిల్లాలోకి కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో మద్యం అమ్మకాలు పెరగనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున నెలకు రూ.40 కోట్ల మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. పాపులర్ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చి, దుకాణాలను పెంచి, తక్కువ ధరకే సరఫరా చేస్తే అమ్మకాలు పెరగనున్నాయి.

మొదలైన సందడి

జిల్లాలో 65 ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు 10 బార్, రెస్టారెంట్లు ఉన్నాయి. ఎనిమిది బార్, రెస్టారెంట్లు నడుస్తున్నాయి. కొత్త పాలసీలో భాగంగా జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాల సంఖ్యను నిర్ణయిస్తారు. ఈలెక్కన జిల్లాలో 72 మద్యం దుకాణాలకు పెరిగే చాన్సు ఉంటుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 10 శాతం కేటాయించాలని కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. గీత కార్మికులు అత్యధికంగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లో ఉన్న నేపథ్యంలో ఏయే మండలాల్లో కేటాయిస్తారో అన్న చర్చ నడుస్తోంది. కొత్త మద్యం పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతం తరహాలోనే లాటరీ విధానంలో వీటిని కేటాయిస్తారని తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలో వాక్ ఇన్ స్టోర్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. లైసెన్సులు పొందిన వారి దుకాణాల పక్కనే స్టోర్లు అదనంగా ఫీజు చెల్లించి ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి అదనంగా రూ.5 లక్షలు లైసెన్సీదారులు ప్రభుత్వానికి చెల్లించాలి. జిల్లాలో రూ.50 లక్షల నుంచి 80 లక్షల దాకా దుకాణాల లైసెన్సు ఫీజు పెట్టనుంది. దుకాణాల దరఖాస్తు రుసుం రూ.2లక్షలతో ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. దీంతో దుకాణాల నిర్వహకుల్లో సందడి మొదలైంది. హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు, ముదిగుబ్బ, బత్తలపల్లి, మడకశిర, చిలమత్తూరు, పుట్టపర్తి తదిరత ప్రాంతాల్లో దుకాణాలకు పోటీ పడే అవకాశం ఉంది. మండలానికి రెండు దుకాణాలు ఏర్పాటు చేయవచ్చు. దుకాణాల కోసం బృందాలుగా ఏర్పడి, దరఖాస్తుదారులు సిద్ధమవుతున్నారు.



బదిలీల్లో గందరగోళం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 21: జిల్లా పంచాయతీల్లోని గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల కోసం శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. అభ్యర్థులకు కౌన్సెలింగ్ కోసం డేట్స్ ఇస్తామని చెప్పిన ఉన్నతాధికారులు ఉన్నఫలంగా మేసేజ్ చేసి వెంటనే హాజరు కావాలని చెప్పడంతో ఉమ్మడి జిల్లా సరిహద్దు మండలాల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సిబ్బంది ఇబ్బంది పడ్డారు. జేసీ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అంతకుముందే అక్కడ మహిళా పోలీస్‌లకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. అది ఆలస్యం కావడంతో వేదికను మినీ సమావేశ భవనంలోకి మార్చారు. ఎవరు కౌన్సెలింగ్‌కు రావాలి, ఎవరు వద్దు అన్నది స్పష్టత లేకపోవడంతో రెండు జిల్లాల అభ్యర్థులు ఒకేసారి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. దీంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. అధికారులు మాత్రం వారు తయారు చేసుకున్న జాబితాకు అనుగుణంగా ప్రతి 50 మందికి ఒకసారి కౌన్సెలింగ్ నిర్వహించేలా ప్లాన్ చేశారు. మొదటి 50 మంది ఎవరన్నది కూడా అర్థంకాని పరిస్థితి. చంటి బిడ్డలతో కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి తొలుత కౌన్సెలింగ్ నిర్వహించి వారు వెళ్లేలా జేసీ చొరవ చూపారు. ఇది మినీ సమావేశ భవనంలోకి వచ్చిన వారికి మాత్రం వర్తించింది. బయట చిన్నపిల్లలతో ఇబ్బంది పడుతున్న వారికి సమాచారం అందించేవారు లేకపోవడంతో వారికి తిప్పలు తప్పలేదు. అనంతరం స్పౌజ్‌కు, మ్యూచువల్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సాయంత్రం 4గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో డీపీఓ ప్రభాకర్‌రావు, పుట్టపర్తి ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి, డీఎల్‌పీఓ సుమన జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, సెప్టెంబరు 21: శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తులు శనివారం స్థా నిక ప్రశాంతి నిలయంలో ఆలపించిన భక్తిగీతాలు మైమరపింపజేశాయి. మొదట సత్యసాయి అష్టోత్తర నామావళి పేరుతో పూజలు చేశారు. అనంతరం సత్యసాయి స్వర మాధురిపేరిట సంగీత కచేరి నిర్వహించారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ఒడిశా భక్తులకు కుట్టుమిషన్లను సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పంపిణీ చేశారు. వందలాదిమందికి కుట్టుమిషన్లు, పిండిమిషన్లు, టూల్‌కిట్లను అందజేశారు. కార్యక్రమం లో 3500 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం వారందరూ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.